సాక్షి
సిద్దిపేట
బుధవారం । 23 । జూలై । 2025



వేతన వెతలు

మూడు నెలలుగా వేతనాలు అందక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాలు 8లో ▸



పంట మార్పిడి చేస్తేనే..

ఏక పంట విధానం సరికాదని, పంట మార్పిడి తప్పనిసరి అని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వివరాలు 8లో ▸



తాగునీటికి తిప్పలు

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మహిళలు నిరసనకు దిగుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కూడవెల్లిలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో రామలింగేశ్వరస్వామి

దుబ్బాక: దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన భూంపల్లి–అక్బర్‌పేట మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయంలో స్వామివారితో పాటు ప్రాంగణంలోని అన్ని ఆలయాల్లో అమ్మవార్లను, స్వామివార్లను రకరకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సాకేత్‌శర్మ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఈ ఏడాదికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పీజీఆర్‌ఆర్‌సీడీఈ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ డిగ్రీ కోర్సులతో పాటు ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సులు, పీజీ డిప్లమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440884089 నంబర్ లేదా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లు ఆన్‌చేయాలి: హరీశ్

సాక్షి, సిద్దిపేట: కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేసి మల్లన్న సాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్‌లలో నీటిని నింపాలని, రైతులు సాగు నీటి కోసం ఇబ్బంది పడకుండా చూడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు కోరారు. అభివృద్ధి సమీక్షలో హరీశ్‌రావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు ఇద్దరు దోస్తులు కలిసి బనకచర్లను నిర్మిస్తున్నారని ఆరోపించారు. అంగన్ వాడీ టీచర్లకు సైతం ఒకటవ తేదీననే జీతాలు చెల్లించాలన్నారు. నాయిబ్రాహ్మణులు, రజకులకు ఉచిత విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు.

జల దోపిడీని అడ్డుకుందాం

హుస్నాబాద్: ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు పేరుతో తెలంగాణ నీటి వాటాను దోపిడీ చేయాలని కుట్ర పన్నుతోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో తెలంగాణకు జరిగే నష్టాన్ని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు పేరుతో గోదావరి నది జలాల దోపిడీని ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రతి కళాశాలలో విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టు కుట్రను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల రుణాలిచ్చేందుకు కృషి

డీసీసీబీ బ్యాంకు చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): రైతులకు అన్ని రకాల రుణాలు అందించేలా డీసీసీబీ బ్యాంకు కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. కొండపాకలోని పీఏసీఎస్ కార్యాలయంలో నాబార్డు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు, మహిళా సంఘాలకు రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పదేళ్ల కిందట రూ.450 కోట్ల లావా దేవీలతో కొనసాగిన డీసీసీబీ బ్యాంకు సేవలను రూ.2,450 కోట్ల లావాదేవీలకు పెంచామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ మరింత ఎక్కువ రుణాలను పొందేలా చూసుకోవాలన్నారు. రైతులకు ఎరువుల కొరతలు ఉండకుండా సహకార సంఘం నుంచి అందజేస్తున్నామన్నారు. మహిళలు ముందుకు వస్తే కుటీర పరిశ్రమల నిర్వహణ కోసం రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

26న దుబ్బాకలో మెగాహెల్త్ క్యాంపు

దుబ్బాక: పట్టణంలో ఈ నెల 26న అఖిలరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చింత రాజు మాట్లాడుతూ పట్టణంలోని వైశ్యభవన్‌లో నిర్వహిస్తున్న మెగా హెల్త్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాన్సర్, గుండె, నేత్ర, ఎముకలు, గైనకాలజీ, దంతం, మెదడు, నరాలు, తదితర రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారన్నారు.



సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి వివేక్, చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బక్కి వెంకటయ్య, కలెక్టర్ తదితరులు



4 గంటలు.. 22 శాఖలు

అభివృద్ధి పనులపై నిర్విరామంగా మంత్రి వివేక్ సమీక్ష

నాలుగు గంటలు నిర్విరామంగా.. 22 ప్రభుత్వ శాఖల సమీక్ష సాగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై ప్రశ్నించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి, కార్మిక శాఖ మంత్రి వివేక్ నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు.

– సాక్షి, సిద్దిపేట

- సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి
- సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలి
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్
- సమస్యల వర్షం కురిపించిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు

మధ్యాహ్నం 2:50గంటలకు ప్రారంభమైన సమీక్ష సమావేశం సాయంత్రం 6:50గంటల వరకు కొనసాగింది. వ్యవసాయం, హౌసింగ్, వైద్య ఆరోగ్య , రెవెన్యూ, విద్యా, బీసీ, ఎస్సీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి, జిల్లా పంచాయతీ, విద్యుత్తు, ఇరిగేషన్, మిషన్ భగీరథ, కార్మిక, ఉపాధి, పరిశ్రమలు, మైనింగ్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలపై సమీక్షను నిర్వహించారు. సమీక్ష సమావేశాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించాలని, 20నెలల్లో ఒక్కసారి మాత్రమే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్ష నిర్వహించారని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. వెంటనే మంత్రి వివేక్ స్పందించి రాత్రి అయినా పర్వాలేదు అన్ని శాఖల పై సమీక్ష చేద్దామన్నారు. ఇప్పటి నుంచి మూడు నెలలకు ఒక సారి నాల్గవ సోమవారం జిల్లా అభివృద్ధిపై సమీక్షను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు జిల్లా అధికారులు సమాధానాలు చెప్పారు. వివిధ శాఖల్లో గత ప్రభుత్వంలో డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయా? ప్రస్తుతం 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయా అని మంత్రి వివేక్, ఎమ్మెల్యే హరీశ్‌లు అధికారులను అడుగుతూ నవ్వులు పూయించారు. కార్మిక శాఖకు సంబంధించిన నివేదిక హార్డ్ కాపీని తీసుకురాకుండా ఫోన్‌లో చూసుకుంటూ లేబర్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రావు చదివారు. ఫోన్‌లు ఎవరు మాట్లాడవద్దని, ఫోన్‌లు హాలులోకి తీసురావద్దని జిల్లా అధికారులను మంత్రి ఆదేశించారు.

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, రైతు భరోసా, రైతు బీమా, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ అన్నారు. మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం 10 వేల టీచర్ల నియామకం చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ప్రలోభాలకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

యూరియా కోసం బారులు

జిల్లాకు యూరియాను పూర్తి స్థాయిలో సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉదయం లేసిందంటే యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జిల్లాలో విద్యుత్ కండక్టర్ల కొరత ఉందని దీంతో నూతన విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడం లేదని ఆరోపించారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని, సన్న వడ్ల బోనస్ రైతులకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకపోవడంతో పశువులు, రైతులు మృత్యువాత పడుతున్నారని, ఎన్నో మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫార్వర్డ్ చేసి టైంపాస్ చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు.

సిద్దిపేటకు వెయ్యి పడకల ఆస్పత్రి అవసరమా?: మంత్రి వివేక్

ఐదు జిల్లాలకు కేంద్రమైన సిద్దిపేట జిల్లాలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మాణం చివరి దశలో ఉంది. ఆస్పత్రికి కొంత మైనర్ వర్క్‌లకు దాదాపు రూ.25కోట్లు కేటాయిస్తే వినియోగంలోకి వస్తుందని దానికి నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలని మంత్రి వివేక్‌ను ఎమ్మెల్యే హరీశ్ రావు కోరారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ మాట్లాడుతూ చిన్న ఊరికి ఇంత పెద్ద ఆస్పత్రి అవసరమా? చెన్నూరులో 100 పడకల ఆస్పత్రి మాత్రమే ఉందని అని అన్నారు. వెంటనే హరీశ్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతో రూ.300 కోట్లతో నిర్మాణం చేశామని గుర్తు చేశారు.

ప్రజా సంక్షేమమే ముఖ్యం

- ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం
- మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు కృషి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్
- కలెక్టరేట్‌లో రేషన్‌కార్డు ప్రొసీడింగ్‌ల పంపిణీ



రేషన్ కార్డు మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఇన్‌చార్జి మంత్రి వివేక్

సిద్దిపేటరూరల్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కొండపాక, సిద్దిపేట అర్బన్ మండలాల రేషన్‌కార్డు లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరై రేషన్ కార్డు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల కొత్త రేషన్‌కార్డులు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రేషన్ కార్డుతో ప్రజలు సన్నబియ్యంతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలకు అర్హత పొందేందుకు వీలుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. నేడు ప్రజలు సంతోషంగా తింటున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం సరఫరా అయ్యేలా కలెక్టర్, యంత్రాంగం పర్యవేక్షించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీ గ్యాస్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, సన్నధాన్యానికి బోనస్ వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని, ఇక ముందు మరింత ఎక్కువగా ఇళ్లను ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు 400 నుంచి 600 చదరపు అడుగుల్లోనే ఇళ్లు నిర్మించుకుంటేనే డబ్బులు వస్తాయన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

అంతకుముందు ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాల మేరకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కొత్త రేషన్‌కార్డులు మంజూరైన వారికి కూడా సన్న బియ్యం అందించాలన్నారు. సన్నబియ్యంలో నూకలు ఎక్కువగా ఉండి అన్నం ముద్దగా అవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. నాణ్యమైన బియ్యం సరాఫరా చేసేలా ప్రభుత్వం పర్యవేక్షించాలన్నారు. తమతో పాటుగా జిల్లా అభివృద్ధికి ఇన్‌చార్జి మంత్రి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీసీఎస్ఓ తనూజ, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బక్కి వెంకటయ్య అసహనం

రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో ఎందుకు వేయలేదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య కలెక్టర్‌ను అడిగారు. అలాగే తన పేరుతో కుర్చీ కూడా ఏర్పాటు చేయకపోవడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన మంత్రి వివేక్ తప్పకుండా ప్రొటోకాల్ పాటించాలని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చూసుకోవాలన్నారు.

ప్రొటోకాల్ రగడ

ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ ప్రక్రియలో ప్రొటోకాల్ రగడ ఉద్రిక్తతకు దారితీసింది. పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫొటో ఎందుకు లేదంటూ బీఆర్‌ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు సైతం హరీశ్‌రావు, కొత్తప్రభాకర్‌రెడ్డిలు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయడంతో గందరగోళం కాస్త ఉద్రిక్తంగా మారింది. రంగప్రవేశం చేసిన పోలీసులు ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఇందిరమ్మ ఇళ్లు అందరికీ రావడంలేదని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించగా.. స్పందించిన మంత్రి వివేక్ గత పదేళ్లలో మీరు ఎన్ని ఇళ్లు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాజకీయం చేయద్దంటూ బీఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు.



ఎమ్మెల్యే ఫొటో లేదంటూ బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

దాశరథి జీవితం యువతకు స్ఫూర్తి

ప్రముఖ కవి నందిని సిధారెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: సమాజంలోని అసమానతలను తొలగించేందుకు కవిత్వం ఉపయోగపడుతుందని ప్రముఖ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సాహిత్య సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'దాశరథి జీవితం, సాహిత్యం–ప్రేరణలు' అనే అంశంపై సిధారెడ్డి మాట్లాడారు. సంస్కృత భాషాధిపత్యాన్ని ఎదిరించడంతో ప్రారంభించింది మొదలు.. తన 15 ఏళ్ల వయస్సులో నిజాం పాలనపై సాహిత్యాన్ని ఆయుధంగా మలచి పద్యాలు రాసి ఊరూరా ప్రచారం చేసి నాటి పాలకులకు నిద్రలేకుండా చేశారన్నారు. దాశరథి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ దాశరథి పద్యాలు తెలంగాణ ప్రజలకు కంచు కాగడాలై కొత్త వెలుగులను అందిస్తాయని చెప్పారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దాశరథి కవిత్వపు మానవీయత, సమాజదృక్పథం, సాహితీ వైవిధ్యం ఉద్యమాల ప్రేరణ, ధిక్కార స్వరం, సాహసాన్ని పునికిపుచ్చుకుని విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీఓఈ డాక్టర్ గోపాలసుదర్శనం, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

జా.సా.ప ఆధ్వర్యంలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో జాతీయ సాహిత్య పరిషత్(జాసాపా) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కవులు దాశరథి సాహిత్యం, ఆయన తెలంగాణ ప్రజలను చైతన్యం చేసిన తీరును గుర్తు చేసుకున్నారు. నా తెలంగాణ.. కోటి రతనాల వీణ అని నినదించిన ఆయన సాహిత్యం అజరామరమన్నారు. కార్యక్రమంలో కవులు రాజమౌళి, ఉండ్రాళ్ల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ అదుర్స్.. కోతులు బెదుర్స్

ఇవేం పరికరాలని ఆశ్చర్యపోతున్నారా?.. కోతులను తరిమేందుకు ఉపయోగించే పరికరాలివి. కోతులతో రైతులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మారుతున్న కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో కొత్త కొత్త పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. దుబ్బాకలో గుజరాత్‌కు చెందిన వ్యాపారులు కోతులకు ఎలాంటి హాని కలగకుండా శబ్దం చేసే పరికరాలను విక్రయిస్తున్నారు. ఈ శబ్దంతో కోతులు బెంబేలెత్తుతున్నాయని రైతులు తెలిపారు. ధర రూ.150 ఉండడంతో రైతులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు.

– దుబ్బాకటౌన్



దుబ్బాకలో కోతులను తరిమే పరికరాలను విక్రయిస్తున్న మహిళ

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ వేదికగా కొనసాగుతున్న ప్రీ సుబ్రతో జాతీయ ఫుట్‌బాల్ పోటీలు క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తున్నాయి. టోర్నీలో రెండోరోజు మంగళవారం షిల్లాంగ్, పాట్నా రీజియన్లు ఆధిపత్యం ప్రదర్శించాయి. అండర్–17, అండర్–15 రెండు విభాగాల్లోనూ ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో సత్తాచాటేందుకు సన్నద్ధమవుతున్నారు.

రెండోరోజు విజేత జట్లు

అండర్–15 విభాగం నుంచి పట్నా, షిల్లాంగ్ జట్లు అత్యుత్తమ ప్రదర్శనతో ఫైనల్‌కు చేరాయి. లీగ్ మ్యాచ్‌లలో షిల్లాంగ్ జట్టు పూణె జట్టును 9–0, చండీఘర్ జట్టును 5–0 గోల్స్‌తో చిత్తుచేసింది. చండీఘర్ జట్టు 3–0తో జైపూర్‌ను, లక్నో జట్టు 2–0 గోల్స్‌తో పాట్నాను, భోపాల్ జట్టు 2–1తో హైదరాబాద్‌ను ఓడించాయి. భోపాల్, లక్నో జట్ల మధ్య 2–2 గోల్స్‌తో మ్యాచ్ టై అయింది. అదే ఒరవడిలో జైపూర్, పూణె జట్ల మధ్య మ్యాచ్ కూడా 0–0 గోల్స్‌తో టై అయింది. సెమీఫైనల్‌లో పాట్నా 4–0 గోల్స్‌తో లక్నోను ఓడించి ఫైనల్‌కు చేరుకోగా, మరో సెమీఫైనల్‌లో షిల్లాంగ్ 4–1 గోల్స్‌తో లక్నోను ఓడించి ఫైనల్‌కు చేరింది.

అండర్–17 విభాగంలో..


అండర్–17 విభాగంలోనూ షిల్లాంగ్, పాట్నా జట్లే ఫైనల్‌కు చేరాయి. రెండోరోజు లీగ్ మ్యాచ్‌లలో పాట్నా 9–0 గోల్స్‌తో జైపూర్‌ను, 2–0 గోల్స్‌తో చండీఘర్‌ను ఓడించింది. షిల్లాంగ్ 6–0 గోల్స్‌తో హైదరాబాద్‌ను, చండీఘర్ 7–1 గోల్స్‌తో భోపాల్‌ను ఓటమిపాల్జేశాయి. లక్నో 3–1 గోల్స్‌తో పూణెను, భోపాల్ 1–0 తో జైపూర్‌ను ఓడించాయి. సెమీఫైనల్స్‌లో షిల్లాంగ్ 3–1 గోల్స్‌తో చండీఘర్‌ను, రెండో సెమీఫైనల్‌లో పాట్నా, లక్నో మ్యాచ్ టై కాగా పెనాల్టీ షూటవుట్ ద్వారా 4–2 గోల్స్‌తో పాట్నా ఫైనల్‌కు చేరింది. ఫైనల్స్‌లో షిల్లాంగ్, పాట్నా తలపడనున్నాయి.



రెండో రోజు పోటీలలో హోరాహోరీగా పోరాడుతున్న క్రీడాకారులు

పట్టు సాగులో ఆధునికత అవసరం

సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు



పట్టు పురుగులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): పట్టు సాగులో ఆధునికతను అందిపుచ్చుకుని, నూతన టెక్నాలజీని వినియోగించాలని సెంట్రల్ స్కిల్ బోర్డు శాస్త్రవేత్తలు వినోద్‌కుమార్, రాఘవేంద్రలు తెలిపారు. పట్టు రైతుల అభివృద్ధి కోసం సెంట్రల్ సిల్క్ బోర్డు ఆదేశాలతో మంగళవారం మండల పరిధిలోని చంద్లాపూర్, జక్కాపూర్ గ్రామాల్లో బేస్ లైన్ సర్వే చేశారు. వారు మాట్లాడుతూ బేస్‌లైన్ సర్వేకు సిద్దిపేట, సిరిసిల్ల, రంగారెడ్డి జిల్లాలు ఎంపికయ్యాయన్నారు. పట్టు సాగులో మెలకువలపై రైతులతో చర్చించారు. అధిక ఆదాయం ఉన్న ఈ సాగులోకి రైతులను ఎలా ప్రోత్సహించాలన్న విషయాలపై చర్చించారు.

ఉడకని అన్నం నీళ్ల చారు

- పప్పంతా కారమే
- కానరాని కూరగాయాలు, ఆకు కూరలు
- జనగామ పాఠశాలలో మధ్యాహ్న భోజనం దుస్థితి



నీళ్లచారు, కారం పప్పు



కారం పప్పుతోనే భోజనం చేస్తున్న విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉడకని అన్నం.. నీళ్లచారు.. కారం పప్పు.. ఇదీ ప్రభుత్వ పాఠశాలలో నిత్యం కనిపించే మధ్యాహ్న భోజనం దుస్థితి. అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 77మంది విద్యార్థులు ఉన్నారు. అయితే, మంగళవారం మెనూ ప్రకారం అన్నం, కూరగాయలు, సాంబారుతో భోజనం పెట్టాలి. కానీ నీళ్లచారు, కారం పప్పుతో ఉడకని అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా విద్యార్థులను 'సాక్షి' పలకరించగా.. రోజూ నీళ్ల చారు, కారం పప్పుతోనే భోజనం పెడుతున్నారని వాపోయారు. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, పప్పులో కుళ్లిన టమాటా, మిర్చి తదితర వస్తున్నాయని చెబుతున్నారు. పోషకాహారం దేవుడెరుగు, కనీసం చిక్కటి పప్పు అన్నం అందడం లేదని తెలిపారు. ఇదేమిటని ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్మికులను అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని చెప్పినా వినడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రగతి చక్రం పురస్కారాలు ప్రదానం


పురస్కారాలు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

జహీరాబాద్ టౌన్: అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం పురస్కారాలు అందజేశారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్సు డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఉద్యోగులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ.800, రెండో బహుమతిగా రూ.600, మూడవ బహుమతిగా రూ.400 చొప్పున నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎం టి.స్వామి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, గ్యారేజ్ ఇన్‌చార్జి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీవాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కవిసమ్మేళనం, పుస్తకావిష్కరణల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించనున్న కవిసమ్మేళనం, పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవులు మిట్టపల్లి పరశరాములు, నార్లపురం రాములు, వరుకోలు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లీ ముగ్గురు పిల్లలు అదృశ్యం



అమ్రెన్, ఆమె పిల్లలు

జహీరాబాద్: ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. టౌన్ ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... పట్టణానికి చెందిన ఎం.డి. హర్షద్ తన చెల్లెలు అయిన అమ్రెన్‌ను 20 రోజుల క్రితం ఇంటికి తీసుకుని వచ్చాడు. ఆమె భర్త నూర్ తరచూ గొడవ పడుతుండటంతో అమ్రెన్ తన ముగ్గురు పిల్లలతో అన్న వద్ద ఉంటోంది. ఈనెల 15న మధ్యాహ్నం కిరాణా షాప్‌కు వెళ్లి వస్తానని అన్నతో చెప్పి ముగ్గురు పిల్లలు అలియ(9), మహెరా(7), ఆహిల్(5)లను తీసుకుని వెళ్లింది. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వృద్ధురాలిపై వీధి కుక్క దాడి



వీధి కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు అనసూర్య, చిన్నారి

అక్కన్నపేట(హుస్నాబాద్): వీధి కుక్క దాడిలో ఓ వృద్ధురాలి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన భూంపల్లి అనసూర్య అనే వృద్ధురాలు నడుచుకుంటే కిరాణ షాపునకు వెళుతోంది. ఈ క్రమంలో వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. దీంతో హుటాహుటిన హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

చిన్న శంకరంపేటలో ఆరుగురు..

చిన్న శంకరంపేట (మెదక్): వీధి కుక్కల దాడిలో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని సూరారం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రిషినందన్, రిశ్విత్, భార్గవి, బోండ్ల లింగంతో పాటు మరో ఇద్దరిని మొత్తం ఆరుగురిని వీధి కుక్కలు దాడి చేయగా గాయాలయ్యాయి. వీరిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆరుగురిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు.

68 మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో మంగళవారం సాయంత్రం పోలీసు సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో 68 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని సీపీ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 410 కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు రాజేష్, విజయభాస్కర్, ఉమేష్ పాల్గొన్నారు.

వేతన వెతలు

- మూడు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి సిబ్బంది
- పట్టించుకోని అధికారులు


జీతాలు చెల్లించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): చాలీచాలని జీతాలు అవి కూడా సమయానికి రాకపోవడం వల్ల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమవ్వడంతో అప్పులు చేస్తున్నారు. ఆ అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు చెల్లించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో అవస్తలు పడుతున్నారు.

620 గ్రామాలు.. 340 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు

సంగారెడ్డి జిల్లాలో 620 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 340 మంది (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు చేసే పనులను పర్యవేక్షిస్తున్నారు. అంతే కాకుండా వారికి క్షేత్ర స్థాయిలో సౌకర్యాలు సైతం కల్పిస్తున్నారు. వీటితో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో ఇతర కార్యక్రమాల్లో సైతం పాల్గొని తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. వారికి నెలకు రూ.12,120 వేతనం ప్రభుత్వం చెల్లిస్తుంది. చెల్లిస్తున్న కొద్ది పాటి వేతనంతో వారు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా, ఆ వేతనం కూడా సమయానికి రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుటుంబ పోషణకు అప్పులు..

మూడు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దె, తదితర అవసరాల కోసం ఇతరుల వద్ద అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. అప్పులు తీర్చలేక, ఇతరుల వద్ద అప్పు పుట్టక నానా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. ప్రభుత్వం మాత్రం తమను పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. వేతనాలు అందించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టీఏలకు మూడు నెలలు, ఏపీఓలకు రెండు నెలల నుంచి జీతాలు అందడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే ఇవ్వాలి



మూడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ, ఇతరత్ర ఖర్చుల కోసం ఇతరుల వద్ద అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం చర్యలు తీసుకొని జీతాలను వెంటనే ఇవ్వాలి.

– అబ్బాస్ అలీ, ఫీల్డ్ అసిస్టెంట్, బసంత్‌పూర్

వారం పది రోజుల్లో వేతనాలు

ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలు స్పర్శ యాప్ ద్వారా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. యాప్ రూపకల్పనలో కొంత జాప్యం జరుగుతుంది. వారం పది రోజుల్లో వారికి వేతనాలు అందుతాయి. ఎవరూ ఆందోళన చెందవద్దు.

– జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ, సంగారెడ్డి

అశోక్‌ను ఆదుకుంటాం

అల్లాదుర్గం సీడీపీఓ పద్మలత

సాక్షి ఎఫెక్ట్


అశోక్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మలత

రేగోడ్(మెదక్): దివ్యాంగుడు అశోక్‌ను ఆదుకునేందుకు అధికారులు స్పందించారు. ఈ నెల 21న 'సాక్షి దినపత్రిక'లో అంగవైకల్యమే అతనికి శాపమా? పేరిట కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. మంగళవారం అధికారుల ఆదేశాల మేరకు అల్లాదుర్గం సీడీపీఓ పద్మలత అశోక్, అతడి తల్లిదండ్రులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. అశోక్ గతంలో సదరం క్యాంపునకు వెళ్లినా పెన్షన్ రావడం లేదని తెలిపారు. మళ్లీ దరఖాస్తు చేయించి పెన్షన్ వచ్చే విధంగా చూస్తామన్నారు. అదే విధంగా అతడికి ట్రై సైకిల్ లేదా బ్యాటరీ సైకిల్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అవసరమైన సాయం అందించి ఆదుకుంటామని తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య


మహమ్మద్ సభిల్

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామ శివారు తూప్రాన్ నుంచి నర్సాపూర్ హైవేకు 100 మీటర్ల దూరంలో పొదల చాటున మృతదేహం కనిపించడంతో రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండరాయితో కొట్టి హత్య చేసి బట్టలు లేకుండా పడేశారు. హత్యా స్థలానికి కొద్దిదూరంలో మృతుడికి సంబంధించి రెండు వెండి చైన్లు, సిల్వర్ కలర్ వాచ్ లభించింది. హత్యకు గురైన వ్యక్తికి సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో పాటు, ఇతర పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్ బోరబండకు చెందిన మహమ్మద్ సభిల్(21)గా నిర్ధారించారు. తూప్రాన్ మార్చురీలో ఉన్న మృతదేహాన్ని కుటుంబ సభ్యులు చూసి గుర్తుపట్టారు. సోమవారం రాత్రి ఫోన్ రావడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఎక్కడైన హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చి పడేశారా? లేక ఇక్కడే హత్య చేశారా? అనే విషయాలు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఘటనా స్థలాన్ని తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట సిఐ లు రంగాకృష్ణ, జాన్‌రెడ్డి, వెంకటరాజగౌడ్, ఎస్ఐలు శివానందం, సుభాష్‌గౌడ్, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

జిన్నారం (పటాన్‌చెరు): అదృశ్యమైన వృద్ధురాలు శవంగా లభ్యమైన ఘటన గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సూరారం బాలమణి (60) ఈ నెల 15న అదృశ్యమైంది. మంగళవారం గ్రామ శివారులో ఓ మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలించి బాలమణిగా గుర్తించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొత్తగా 23 మందికి చేయూత పింఛన్

- డయాలసిస్ రోగులకు ఊరట
- మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేయూత పథకం ద్వారా వివిధ రకాల పింఛన్లను అందిస్తోంది. ఇందులో భాగంగా డయాలసిస్‌తో బాధపడే వారికి ఆర్థిక సాయం చేస్తోంది. కాగా, జూన్‌లో సుమారు 150మందికి పైగా పింఛన్ మంజూరు కాగా తాజాగా సోమవారం 23 మందికి పింఛన్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంజూరైన వారికి వచ్చే నెల నుంచి పింఛన్ అందించనుంది.

327కు చేరిన లబ్ధిదారుల సంఖ్య

ఇప్పటివరకు జిల్లాలో 304 మందికి చేయూత పథకం ద్వారా డయాలసిస్ రోగులకు పింఛన్ అందిస్తున్నారు. కొత్తగా 23 మందికి మంజూరు కావడంతో లబ్ధిదారుల సంఖ్య 327కు చేరింది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా గుర్తింపు పొందిన వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న వారి ఆధారంగా కొత్తగా పింఛన్‌ను అందిస్తోంది. ఈ పథకం ద్వారా ప్రతినెల ఒక్కొక్కరికి రూ. 2016 లు అందించనుంది.

గీత కార్మికుడికి గాయాలు

హుస్నాబాద్‌రూరల్: గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వృత్తి రీత్యా గీత కార్మికుడు. సోమవారం కల్లు తీసేందుకు తాటి చెట్టు పైకి ఎక్కిన అతడు ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రైవేటు వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీనివాస్‌ను బుధవారం కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గీతా కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రమేశ్ కోరారు.

మద్యం తాగి కారు నడిపి..

- ఇద్దరి మృతికి కారణం
- నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: మద్యం మత్తులో కారు నడిపి తండ్రి, కూతురు మృతి కారణమైన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మిట్టపల్లి శివారులో ఎలక్ట్రిక్ బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో బీహార్‌కు చెందిన మంతోష్‌కుమార్(26) అతని కూతురు ఝాన్సీ (4) మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ కేసు వివరాలు వెల్లడించారు. మిట్టపల్లికి చెందిన కొమ్మిశెట్టి మణిసాయి, సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన సామలేటి పవన్‌కుమార్ ఇద్దరు కలిసి కారులో ఆదివారం మేడ్చల్‌లోని చర్చికి వెళ్లి తిరిగి సిద్దిపేట వస్తుండగా మార్గమధ్యలో వంటిమామిడి వద్ద మద్యం కొనుగోలు చేసి నాంచారుపల్లి శివారులో తాగారు. అనంతరం ఇద్దరు కలిసి మిట్టపల్లిలోని మణిసాయి ఇంటికి వెళ్లారు. ఇంట్లో కిరాణా సామగ్రి లేదని తీసుకురావాలని తల్లి అరుణ చెప్పడంతో సిద్దిపేటకు వచ్చి సామాను తీసుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో రంగధాంపల్లి వద్ద మరోసారి మద్యం కొనుగోలు చేసి ఇంట్లో సామగ్రి ఇచ్చిన తర్వాత ఇద్దరు తాగారు. అనంతరం పవన్‌ను సిద్దిపేటలో దింపి తిరిగి ఇంటికి వెళ్తున్న మణిసాయి మిట్టపల్లి శివారులో ముందు వెళ్తున్న బైకును ఢీకొట్టి కొద్దిదూరం ఈడ్చుకెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తప్పించుకోవడానికి కారును దాచిపెట్టి ఏమీ తెలియనట్టు ఇంటికి వెళ్లాడు. మద్యం మత్తులో ఇద్దరి మృతికి కారణమైన మణిసాయిని, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోగా మద్యం మత్తులో ఉన్న స్నేహితుడికి కారు ఇచ్చి నిందితుడికి సహకరించిన పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధం

మెదక్ మున్సిపాలిటీ: షార్ట్ సర్క్యూట్‌తో మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారు జామున 2గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో దుకాణాలు కాలిపోతున్నాయని పోలీసుల ద్వారా సమాచారం తెలిసింది. దీంతో తాము అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఫైర్ ఇంజిన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా ఈ ప్రమాదంలో పండ్ల దుకాణం, కిరాణంషాపు, సెలూన్‌షాపులు పూర్తిగా కాలిపోయాయి. బాధితులు నర్సింలు, తోగిట నరేష్, మంగలి ఆంజనేయులు ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

కొండపోచమ్మ సాగర్‌లో పడిన యువకుడు మృతి

- సిద్దిపేట జిల్లాలో ఘటన
- మృతుడు రంగారెడ్డి జిల్లా వాసి


మృతుడు సాయికృష్ణ

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మ జలాశయంలోకి దిగిన యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం లో చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం చందానగర్ కాలనీకి చెందిన పట్నపోల్ల సాయికృష్ణ (23)అదే కాలనీకి చెందిన స్నేహితుడు ప్రణయ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకకు మిత్రులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం కారులో కొండపోచమ్మసాగర్‌కు చేరుకున్నారు. స్నేహితుని జన్మదిన వేడుకలు పూర్తి చేసుకున్న యువకులు సరదాగా జలాశయంలోకి దిగి ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో సాయికృష్ణ ఈత రాకపోయినా నీటిలోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు, మర్కూక్ ఎస్ఐలు విజయ్‌కుమార్, దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో రాత్రి 7.30 గంటలకు మృతదేహాన్ని బయటకు తీశారు.

బోనాల పండుగకు వెళ్లొచ్చేసరికి..

ఇంట్లో చోరీ.. బంగారం, వెండి, నగదు అపహరణ


బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... మండలంలోని రామేశ్వరం బండ గ్రామానికి చెందిన మంగమ్మ కుటుంబ సభ్యులతో కలిసి గోకుల్‌నగర్‌లో ఉన్న కూతురి లక్ష్మి ఇంటికి సోమవారం బోనాల పండుగకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న 35 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.25 వేలను ఎత్తుకెళ్లారు. వెళ్లే సమయంలో పగలగొట్టిన తాళం, హెల్మెట్‌ను ఇంటి పక్కనే వదిలేశారు. మంగళవారం ఉదయం ఇంటి పక్కన ఉండే సోదరుడు మల్లేష్ సమాచారం ఇచ్చాడు. వెంటనే మంగమ్మ ఇంటికొచ్చి చూసేసరికి బంగారం, వెండి నగదు కనిపించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలం, సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే సీసీ ఫుటేజీలో ఇద్దరు దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చినట్లు రికార్డు అయింది.

దర్గపల్లిలో బంగారం, నగదు..

నంగునూరు(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో దుండగులు బంగారం నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సోమవారం రాత్రి దర్గపల్లిలో చోటు చేసుకుంది.బాధితుడి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చాడ శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజుల కింద ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉన్న తన కూతురింటికి బోనాల పండుగకు వెళ్లారు. తెల్లవారు జామున ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో చుట్టపక్కల వారు గమనించి శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా బీరువాలో ఉన్న 9 తులాల బంగారం, రూ.95 వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన్‌సాన్‌పల్లిలో మద్యపాన నిషేధం

మద్యం విక్రయిస్తే రూ.10 వేలు జరిమానా

వట్‌పల్లి(అందోల్): అక్రమ మద్యం అమ్మకాలను నిషేధిస్తూ మంగళవారం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామస్తులు గ్రామంలో మద్యపాన నిషేధానికి తీర్మానం చేశారు. మద్యం అమ్మకాలతో గ్రామంలో గొడవలు జరగడం, మద్యానికి బానిసై సంసారాలు నాశనమవుతూ రోడ్డున పడుతున్నాయని గ్రామస్తులంతా ఏకమై మద్యపాన నిషేధం చేయాలని తీర్మానించారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయించినా, తాగినా రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్మానం చేశారు. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా దొంగచాటుగా మద్యం విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు వారికి రూ.5వేల నగదు నజరానా ఇస్తామని తీర్మానంలో పేర్కొన్నారు. మద్యం అమ్మకాల నిషేధంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కుదిరిన అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం(ఎస్‌కెఎల్‌టీజీహెచ్‌యూ), బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)ల మధ్య మంగళవారం అధికారులు శాస్త్రీయ విద్యాపరమైన సహకారం కోసం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఎంఎస్సీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉన్నత శిక్షణ, పరిశోధన, విద్యామార్పిడి అవకాశాలు, ఇరు సంస్థల పరిజ్ఞానం, వనరుల వినియోగంతో పరిశోధన, ప్రచురణ, మేథోసంపత్తి హక్కుల సంరక్షణలో భాగస్వామ్యం కానున్నాయి. కార్యక్రమంలో బెంగళూరు ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ టి.కె బెహ్రా, ములుగు ఉద్యాన యూనివర్సిటీ అధికారులు సురేష్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగు రాయితీలపై అవగాహన


శిక్షణలో పాల్గొన్న రైతులు, ఉద్యాన అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): రైతులు ఉద్యాన శాఖ ద్వారా వచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పట్టు పరిశ్రమ జిల్లా అధికారి శైలజ సూచించారు. మండల పరిధిలోని గుంతపల్లిలో మంగళవారం పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా పూలసాగు మల్చింగ్, పండ్ల తోటలతోపాటు కూరగాయల సాగులో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఇదే కాకుండా తుంపర, బిందు సేద్యం, యంత్ర పరికరాలు, కూరగాయల పందిరికి వచ్చే రాయితీలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు సీతారాం దేశ్‌పాండేతోపాటు గ్రామ రైతులు రామకృష్ణ, లక్ష్మారెడ్డి, హన్మంత్‌రెడ్డి, బక్కారెడ్డి , ప్రవీణ్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దు

జిల్లా వ్యవసాయ అధికారి దేవానంద్


అంబాజీపేటలో వ్యవసాయ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడొద్దని జిల్లా వ్యవసాయ అధికారి దేవానంద్ రైతులకు సూచించారు. మండలంలోని అంబాజీపేట శివారులో బీహార్ కూలీలు వేస్తున్న వరి నాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, దుక్కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. నాటుకోవడానికి ముందే నారుమడిలో ఫ్యూరడాన్ గుళికలు వేయాలని, రసాయన ఎరువులు మాత్రం అధికారులు సూచించినవి మాత్రమే వాడాలన్నారు. ఏడీఏ వినయ్‌కుమార్, ఏఓలు లక్ష్మి, ప్రవీణ్, యాదగిరి, సిబ్బంది వందన, మధుమిక ఉన్నారు.

పంట మార్పిడి చేస్తేనే దిగుబడులు

పంటలను పరిశీలించిన ఏరువాక శాస్త్రవేత్తలు


రైతుకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సిద్దిపేటఅర్బన్: ఒకే పొలంలో ఏళ్ల తరబడి ఒకే పంటను సాగు చేసే ఏక పంట విధానం సరికాదని, పంట మార్పిడి చేస్తేనే రైతులకు మంచి దిగుబడులు వస్తాయని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సంతోష్, డాక్టర్ పల్లవి, జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండలంలోని తడ్కపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్‌తో కలిసి వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరి పొలంలో సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. సల్ఫైడ్ వల్ల దాదాపు సగం దిగుబడి తగ్గుతుందని, ప్రధాన కారణం కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా వినియోగించడం, నీటి పారుదల ఎక్కువగా ఉండటం వల్ల ఇలా జరుగుతుందని తెలిపారు. పొలంలో నడుస్తున్నప్పుడు బుడగలు వస్తాయని, మొక్కల వేర్లు పూర్తిగా నల్లగా మారి జీవం లేక మురుగు వాసన వస్తాయని పేర్కొన్నారు. సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని తగ్గించుకోవడానికి చెరువు మట్టిని వేయాలని, 25 కేజీల యూరియాలో 100 నుంచి 150 గ్రాముల కార్బండిజం, మాంకోజెబ్ ద్రావణాన్ని కలుపుకొని ఎకరా పొలంలో చల్లుకోవాలని, హెక్సాకొనజోల్ 2 మి.లీటర్‌కు ఒక లీటరు నీరు చొప్పున కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినీల పాల్గొన్నారు.